
# కరెంటు వెలుగులా.. కాంగ్రెస్ చీకట్లా?



బీఆర్ఎస్ అభ్యర్థి గంగులను గజమాలతో సత్కరిస్తున్న అభిమానులు, గ్రామస్తులు

- బీజేపీ, కాంగ్రెస్‌కు ఓటేస్తే భవిష్యత్ అంధకారమే
- ఒక్క ఓటు తప్పు జరిగితే యాభై ఏళ్ల వెనక్కి తెలంగాణ
- కరీంనగర్ బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్

కొత్తపల్లి, నవంబర్ 23 : కరెంటు వెలుగులు కావాలా.. కాంగ్రెస్ చీకట్లు కావాలో ప్రజలు ఆలోచించుకోవాలని బీఆర్ఎస్ కరీంనగర్ అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్ సూచించారు. ఆ పార్టీకి ఓటేస్తే తెలంగాణ భవిష్యత్ అంధకారం అవుతుందని హెచ్చరించారు. ఈ మేరకు గురువారం కొత్తపల్లి మండలంలోని శ్రీరాములపల్లి, ఎలగందల్ గ్రామాల్లో, సాయంత్రం నగరంలోని పలు డివిజన్లలో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయా చోట్ల మంత్రి ప్రసంగించారు. బండి సంజయ్‌ను ప్రజలు ఎంపీగా గెలిపిస్తే నాలుగున్నరేళ్లుగా పత్తా లేకుండా పోయి, ఇప్పుడు ఏ ముఖం పెట్టుకొని ఓట్లు అడిగేందుకు వస్తున్నాడని ప్రశ్నించారు. బీసీ ముఖ్యమంత్రి అని బీజేపీ చెప్పుకొని తిరుగుతున్నప్పటికీ రాష్ట్రంలో బీజేపీ వచ్చేది లేదన్నారు. ఆ పార్టీ తెలంగాణలో రెండు సీట్లు కూడా గెలిచే పరిస్థితి లేదని ఎద్దేవా చేశారు. రైతు ఆత్మహత్యలు, కరెంటు కోతలతో తెలంగాణ దరిద్రానికి కారణం కాంగ్రెస్ పార్టీ అని, మళ్లీ వారిని నమ్మి మోసపోతే తెలంగాణ యాభై ఏళ్లు వెనక్కి వెళ్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. పదేళ్ల కేసీఆర్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. యాభై ఏళ్ల దరిద్రం కోరుకుందామా.. పదేళ్ల అభివృద్ధి కొనసాగిద్దామా? ప్రజలే ఆలోచించుకోవాలన్నారు. ఓటు ఎంతో పవిత్రమైనదని, ఒక్క ఓటు తప్పు జరిగినా మన పిల్లల భవిష్యత్ అంధకారం అవుతుందన్నారు. నెల రోజుల్లో శ్రీరాములపల్లిని నూతన గ్రామ పంచాయతీగా చేస్తానని, వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో నూతన సర్పంచ్ ఎన్నికలు జరిగేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. బీజేపీ కాంగ్రెస్ నాయకులు ఎన్నికలప్పుడు మాత్రమే కనిపిస్తారని, తాను మాత్రం ఎల్లప్పుడూ కళ్ల ముందుండే బిడ్డనని, తనను ఆశీర్వదించాలని వేడుకున్నారు. మానేరు రివర్ ఫ్రంట్‌ను వచ్చే ఏడాదిలోగా పూర్తి చేసి కరీంనగర్‌కు అంతర్జాతీయ ఖ్యాతిని తీసుకువస్తానని, ప్రపంచ పర్యాటకులను ఆకర్షించే విధంగా తీర్చిదిద్దుతానని చెప్పారు. ఇక్కడ ఎంపీపీ పిల్లి శ్రీలతామహేశ్, గ్రామ సర్పంచ్ ఎల్లండి షర్మిలాప్రకాశ్, ఎంపీటీసీ మంద రమేశ్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



ఎలగందల్ గ్రామంలో ప్రచారానికి హాజరైన ప్రజలు



అనంతారంలో మానకొండూర్ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌కు గొర్రెపిల్లను బహూకరిస్తున్న గ్రామస్తులు

# ప్రగతిని చూసి పట్టంకట్టండి

- బీఆర్ఎస్‌తోనే మరింత అభివృద్ధి
- కాంగ్రెస్‌ను నమ్మితే గోసపడుతాం
- మానకొండూర్ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్
- పలు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం

ఇల్లంతకుంట, నవంబర్ 23: బీఆర్ఎస్ హయాంలో తొమ్మిదిన్నర ఏండ్లలో జరిగిన అభివృద్ధిని చూసి మరోసారి పట్టంకట్టాలని మానకొండూర్ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ పిలుపునిచ్చారు. గురువారం ఆయన జంగంరెడ్డిపల్లి, అనంతారం, వల్లంపట్ల, ముస్కానిపేట గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించగా, గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా రసమయి మాట్లాడుతూ, దొంగ మొక్కులు, ఆచరణ సాధ్యంకాని హామీలు ఇస్తూ ప్రజల్లో తిరిగే కాంగ్రెస్ నాయకులకు తగిన గుణపాఠం చెప్పాలన్నారు. వాళ్లు ఇక్కడ ఇస్తున్న హామీలు వారు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ఎందుకు అమలు చేయడంలేదని ప్రశ్నించారు. ఎందుకంటే ఆ హామీలు అమలు చేయడం సాధ్యం కాదనే విషయం వారికి తెలుసునని, కేవలం అధికార దాహం కోసం మాత్రమే వారు అడ్డగోలుగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. తెలంగాణ ఏర్పడితే కరెంటు తీగలపై బట్టలు ఆరబెట్టుకోవాల్సిన పరిస్థితి వస్తుందని నాటి ముఖ్యంత్రి చెప్పాడని, కానీ స్వరాష్ట్రంలో ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో రైతులకు 24గంటలు ఇస్తున్నామని స్పష్టం చేశారు. 55 ఏండ్లు అధికారంలో ఉండి కాంగ్రెస్ చేయని అభివృద్ధిని, ముఖ్యమంత్రి కేసీఆర్ చొరవతో పదేండ్లలోనే చేసి చూపించామన్నారు. మరోసారి కారు గుర్తుకే ఓటేసి భారీ మెజార్టీ అందించాలని కోరారు. కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు, ఏఎంసీ చైర్మన్ మామిడి సంజీవ్, సెస్ డైరెక్టర్ రవీందర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పల్లె నర్సింహారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ అన్నాడి అనంతరెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ చింతపల్లి వేణురావు, పీఏసీఎస్ వైస్ చైర్మన్ గొడుగు తిరుపతి, సర్పంచులు చల్ల నారాయణ, కేతిరెడ్డి అనసూయ, తూంకుంట శ్రీలత, పీఏసీఎస్, ఏఎంపీ డైరెక్టర్లు, ఉప సర్పంచులు పాల్గొన్నారు.

# ప్రజలే నా బలం.. బలగం

- నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్న
- కాంగ్రెస్,బీజేపీ నాయకుల మాటలు నమ్మితే గోసపడుతాం
- వెలిచాలలో బీఆర్ఎస్ అభ్యర్థి సుంకె రవిశంకర్ ఎన్నికల ప్రచారం



వెలిచాల గ్రామంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా ర్యాలీ నిర్వహిస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి సుంకె రవిశంకర్, రాష్ట్ర నాయకుడు వీర్ల వెంకటేశ్వరరావు, మాజీ జడ్పీటీసీ వీర్ల కవిత

చొప్పదండి,(రామడుగు), నవంబర్ 23: నియోజకవర్గంలోని ప్రజలే తన బలం.. బలగం అని బీఆర్ఎస్ అభ్యర్థి సుంకె రవిశంకర్ పేర్కొన్నారు. గురువారం రామడుగు మండలంలోని వెలిచాల గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఎన్నికల ప్రచార సభలో సుంకె రవిశంకర్ మాట్లాడారు. ప్రాణం ఉన్నంతవరకు చొప్పదండి నియోజకవర్గ ప్రజలకు సేవ చేస్తానన్నారు. ఈ మట్టిలో పుట్టిన బిడ్డను ఈ మట్టిలోనే కలిసిపోతానన్నారు. స్థానిక బిడ్డనైన తనను ఎన్నికల్లో ఆశీర్వదిస్తే చొప్పదండి నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ నాయకుల మాటలు నమ్మితే గోసపడతామన్నారు. దేశంలో ఎక్కడా జరుగనంత అభివృద్ధి తెలంగాణ రాష్ట్రంలో జరిగిందని స్పష్టం చేశారు. అన్ని వర్గాల సంక్షేమం కోసం పథకాలు ప్రవేశ పెట్టి అమలు చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని కొనియాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ప్రతి గ్రామం అభివృద్ధి చెందిందని, ఇందుకు నిదర్శనం వెలిచాల అని పేర్కొన్నారు. రాష్ట్రస్థాయిలో ఆదర్శ గ్రామంగా నిలిచి అవార్డు పొందిన విషయాన్ని గుర్తు చేశారు. ట్రైనీ ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు శిక్షణలో భాగంగా సందర్శించే స్థాయికి గ్రామం ఎదగడం అభినందనీయమన్నారు. నియోజకవర్గంలో ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేశానని, ప్రజలు రానున్న ఎన్నికల్లో కారుగుర్తుకు ఓటేసి భారీ మెజార్టీ అందించాలని కోరారు. వెలిచాల గ్రామానికి ప్రచారానికి వచ్చిన సుంకె రవిశంకర్‌కు గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు. రాష్ట్ర నాయకుడు వీర్ల వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కలిగేటి కవిత -లక్ష్మణ్, జడ్పీ కో ఆప్షన్ సభ్యుడు శుక్రొద్దీన్, మాజీ జడ్పీటీసీ వీర్ల కవిత, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గంట్ల జితేందర్ రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ ఒంటెల మురళీకృష్ణారెడ్డి, మాజీ ఎంపీపీ మార్కొండ కిష్టారెడ్డి, జిల్లా రైతుబంధు సమితి సభ్యుడు వీర్ల సంజీవరావు, మాజీ సర్పంచ్ వీర్ల రవీందర్‌రావు, ఉప సర్పంచ్ పుధారి వెంకటేశ్, మార్కెట్ డైరెక్టర్ మీసా లచ్చయ్య, గ్రామ శాఖ అధ్యక్షుడు చిమ్మళ్ల మహేశ్, బీఆర్ఎస్ పార్టీ యూత్ మండలాధ్యక్షుడు ఆరెపల్లి ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు



వెలిచాల గ్రామంలో ఎన్నికల ప్రచారానికి హాజరైన ప్రజలు

# చల్లూరును మండలం చేస్తా



దేశాయిపల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి

- 2 వేల మెజార్టీ ఇస్తే గ్రామాన్ని దత్తత తీసుకుంటా
- ఒక్కసారి అవకాశం ఇవ్వండి
- హుజూరాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి, మండలి విప్ పాడి కౌశిక్‌రెడ్డి

వీణవంక, నవంబర్ 23: ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే చల్లూరును మండలం చేస్తానని, ఒక్కసారి ఆశీర్వదించి గ్రామం నుంచి 2 వేల మెజార్టీ ఇస్తే దత్తత తీసుకొని అభివృద్ధి చేస్తానని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, మండలి విప్ పాడి కౌశిక్‌రెడ్డి హామీ ఇచ్చారు. మండలంలోని దేశాయిపల్లి, చల్లూరు గ్రామాల్లో గురువారం రాత్రి మండల ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. దేశాయిపల్లి, చల్లూరు గ్రామాల్లో మహిళలు మంగళహారతులతో, కోళాటం కళాకారులు, ఒగ్గుడోలు కళాకారులు నృత్యం చేస్తూ ఎమ్మెల్యే అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డికి అపూర్వ స్వాగతం పలికారు. అనంతరం రాత్రి హుజూరాబాద్‌లోని శంకర్ రైస్‌మిల్ వద్ద హోం మంత్రి మహమూద్ అలీతో కలిసి కార్నర్ మీటింగ్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కౌశిక్‌రెడ్డి మాట్లాడుతూ, దేశంలోని ఏ రాష్ట్రంలో లేని విధంగా రైతులకు 24 గంటల కరెంట్‌తో పాటు సమృద్ధిగా నీరు అందిస్తున్నది కేవలం బీఆర్ఎస్ ప్రభుత్వమేనన్నారు. రైతన్నలు ఒక్కసారి ఆలోచన చేయాలని, గ్రామాల్లో బీఆర్ఎస్ సంక్షేమ పథకాలపై చర్చ జరుపాలని కోరారు. ఈటల రాజేందర్‌కు 7 సార్లు అవకాశం ఇచ్చి ఎమ్మెల్యేగా గెలిపిస్తే ఏ మాత్రం అభివృద్ధి చేయలేదని, ఒక్కసారి అవకాశం ఇస్తే రూ.వెయ్యి కోట్లు తెచ్చి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని అన్నారు. హుజూరాబాద్‌లో గులాబీ జెండా ఎగురవేస్తే దత్తత తీసుకుంటానని స్వయంగా సీఎం కేసీఆరే చెప్పారని గుర్తు చేశారు. కాంగ్రెస్‌కు ఓటేస్తే మళ్లీ చీకటి రోజులు వస్తాయన్నారు. ఎవరు ఏమన్నా మూడోసారి కేసీఆరే సీఎం అని పేర్కొన్నారు. ఆయా కార్యక్రమాల్లో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పెద్దిరెడ్డి, రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గెల్లు శ్రీనివాస్‌యాదవ్, ఎంపీపీ ముసిపట్ల రేణుక-తిరుపతి రెడ్డి, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు రఘుపాల్ రెడ్డి, సింగిల్‌విండో మాజీ చైర్మన్ గంగాడి తిరుపతిరెడ్డి, జమ్మికుంట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వాల బాలకిషన్‌రావు, చల్లూరు సర్పంచ్ పొదిల జ్యోతి-రమేశ్, ఎంపీటీసీ ఎలవేన సవిత-మల్లయ్య, ఉపసర్పంచ్ సంపత్‌రెడ్డి, గ్రామాధ్యక్షుడు చెనవేన కుమార్‌యాదవ్, మాజీ ఎంపీటీసీ తాండ్ర శంకర్, మాజీ సర్పంచ్ జక్కు నారాయణ, ఫసియొద్దీన్, గోపాలగౌడ్, బొంగోని రాజయ్య తదితరులు పాల్గొన్నారు.